# ఆ రెండే కాదు... ఎన్నో అవకాశాలున్నాయ్!

**విదేశాల్లో ఇంజినీరింగ్, ఎంబీఏ చదివేందుకే మన విద్యార్థుల ప్రాధాన్యం**

- పబ్లిక్ పాలసీ, హెల్త్, లా, ఎకౌంటింగ్, బయోలాజికల్ సైన్సెస్‌లోనూ ఉద్యోగాలు అపారం

- ప్రాడిజీ ఫైనాన్స్ విశ్లేషణ

ఈనాడు, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్‌లో ఎంఎస్ లేదంటే మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ... మన దేశం నుంచి ఉన్నత విద్య కోసం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఐరోపాలకు వెళ్లే విద్యార్థుల ప్రథమ ప్రాధాన్యం వీటికే. వంద మందిలో 90 మంది ఈ కోర్సులను చదవడానికే విదేశాలకు పయనమవుతున్నారు. మేనేజ్‌మెంట్, స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) కోర్సులు లేకుంటే పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ఒప్పుకోరు. అమెరికాలో స్టెమ్ కోర్సుకు వెళ్లే విద్యార్థులకు ఐదేళ్ల స్టూడెంట్ వీసా దొరుకుతుంది. రెండేళ్ల మాస్టర్ డిగ్రీ తర్వాత మూడేళ్లపాటు ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) లభిస్తుంది. అందువల్ల ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ ప్రోగ్రాములనే ఇష్టపడుతున్నారు. ఇవేకాకుండా మరికొన్ని ఇతర రంగాల్లోనూ అపార అవకాశాలు ఉన్నాయని, ఈ రంగాలు ఇప్పుడిప్పుడే భారతీయ విద్యార్థులతోపాటు ఇతర దేశాల విద్యార్థులనూ ఆకర్షిస్తున్నాయని విద్యాభ్యాసానికి రుణాలు, ఉపకార వేతనాలు ఇచ్చే సంస్థ ప్రాడిజీ ఫైనాన్స్ తాజా నివేదికలో పేర్కొంది. ఆ ప్రకారం...



- పబ్లిక్ పాలసీ, పబ్లిక్ హెల్త్, లా, ఎకౌంటింగ్, బయోలాజికల్ సైన్సెస్ కోర్సుల్లోనూ మెరుగైన అవకాశాలు విద్యార్థులకు లభిస్తున్నాయి.
- భిన్న రంగాలకు చెందిన కోర్సులు అందించడం ద్వారా, మెరుగైన అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యార్థులను తయారు చేయడంలో హార్వర్డ్, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ, ...మిగతా 2లో

# ఆ రెండే కాదు... ఎన్నో అవకాశాలున్నాయ్!

(మొదటి పేజీ తరువాయి)

స్టాన్‌ఫోర్డ్ లా స్కూల్ అగ్రస్థానంలో ఉన్నాయి.

## మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ)

ఈ ఏడాదిలో ఇంజినీరింగ్, ఎంబీఏ కోర్సులు కాకుండా ఇతర ప్రోగ్రాముల్లో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(ఎంపీపీ) అగ్రస్థానంలో ఉంది. ప్రభుత్వ, సామాజిక కార్యకలాపాల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకుంటున్నారు. దీన్ని పూర్తి చేసిన వారికి పాలసీ అనలిస్ట్, ప్రభుత్వ వ్యవహారాల డైరెక్టర్స్ వంటి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. హార్వర్డ్, ఆక్స్‌ఫోర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్కిలీ తదితర విద్యా సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

## ఇతర కోర్సులు

కొవిడ్-19 తర్వాత ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఎంతో పెరిగింది. ఈ విభాగంలో మాస్టర్స్ చేసిన వారికి అధిక డిమాండ్ ఉంటోంది. వివిధ యూనివర్సిటీలు ఎపిడెమియాలజీ, హెల్త్ పాలసీ, కమ్యూనిటీ హెల్త్ సర్వీసెస్ విభాగాల్లో గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాములను ప్రారంభించాయి. జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ, హార్వర్డ్, లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ఈ విభాగంలో క్రియాశీలక విద్యా సంస్థలుగా ఉన్నాయి.

- ఇటీవల కాలంలో విదేశాల్లో ఎల్ఎల్ఎం (మాస్టర్స్ ఆఫ్ లా) చదివే విద్యార్థుల సంఖ్య బాగా పెరుగుతోంది. ఈ విభాగంలో స్టాన్‌ఫోర్డ్ లా స్కూల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ (యూసీఎల్), ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీకి మంచి పేరుంది.
- అకౌంటింగ్ కోర్సుల్లో చేరాలనుకునే వారికి న్యూయార్క్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మిస్సిసిపి, యూనివర్సిటీ ఆఫ్ ఇలినోయి ముఖ్యమైన విద్యా సంస్థలు. బయోలాజికల్ సైన్సెస్‌లో యూనివర్సిటీ ఆఫ్ లీడ్, క్వీన్స్ యూనివర్సిటీ బెల్‌ఫాస్ట్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాంతాక్రజ్‌లకు ఎంతో పేరుంది. మాలిక్యులర్ బయాలజీ, ఎర్త్ సైన్స్, ఎకాలజీ విభాగాల్లో ఈ యూనివర్సిటీలు గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాములు అందిస్తున్నాయి. వీటిని పూర్తిచేసిన విద్యార్థులకు ఫార్మాస్యూటికల్, బయోటెక్, రెన్యూవబుల్ ఎనర్జీ, పర్యావరణ పరిరక్షణ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.